క్లుప్తంగా

రైతులు ఆందోళన చెందవద్దు



పంటలను పరిశీలిస్తున్న నాయకులు

మెట్‌పల్లిరూరల్‌:పంటలు నష్టపోయిన రైతులు ఆందోళన చెందవద్దని మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ కూన గోవర్ధన్‌ అన్నారు. మెట్‌పల్లి మండలం మేడిపల్లిలో ఈదురుగాలులు, వర్షం కారణంగా దెబ్బతిన్న పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట నష్టం ఎంత జరిగిందనే వివరాలను వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖుతుబొద్దీన్‌, నగేశ్‌,గంగాధర్‌,తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌ నేరాల నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కథలాపూర్‌: సైబర్‌ నేరాల నియంత్రణపై మండల కేంద్రంలోని బస్టాండ్‌ ఏరియాలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి, మత్తు పదార్థాలు విక్రయాలు జరిపిన, సేవించినా కఠిన చర్యలుంటాయన్నారు. మూఢ నమ్మకాలను ప్రజలు నమ్మవద్దన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్‌ చేస్తే వ్యక్తిగత సమాచారం ఇవ్వవద్దన్నారు. సైబర్‌ మోసాలు జరిగితే వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్‌ చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీస్‌ అధికారులు లీలానాయక్‌, రాజు, మధు, అరుణ్‌ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్‌ కుసుమ

ధర్మపురి: పట్టణంలోని పాత హరిజనవాడ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం పౌష్టికాహారంపై ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ కుసుమ అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారంపై వివరించారు. పౌష్టికాహార లోపం వలన చిన్నారుల్లో ఎదుగుదల తగ్గుతుందని, రక్తహీనత తదితర రుగ్మతలు కలుగుతాయని తెలిపారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌ బేర మరియ బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి



అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న నారాయణ

జగిత్యాలటౌన్‌: అంబేడ్కర్‌ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని రిటైర్డ్‌ ఎంఈవో మద్దెల నారాయణ అన్నారు. ప్రబుద్ధ భారత్‌ ఇంటర్నేషనల్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పట్టణంలోని తహసీల్‌ చౌరస్తాలో అంబేడ్కర్‌ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళి అర్పించారు.కార్యక్రమంలో ప్రబుద్ధ భారత్‌ ఇంటర్నేషనల్‌ ఫౌండేషన్‌ (డిక్కీ) జిల్లా అధ్యక్షుడు నల్ల శ్యాం, నాయకులు నక్క విజయ్‌, చిత్తారి ప్రభాకర్‌, చింతకుంట గంగాధర్‌ తదితరులు పాల్గొన్నారు.

భూపతిపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

రాయికల్‌: మండలంలోని భూపతిపూర్‌లోని జగిత్యాలలోని వేంకటేశ్వర ఆర్థో ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్‌ విజయ్‌రెడ్డి 120 మందికి ఉచితంగా ఆర్థో పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌ విండో చైర్మన్‌ ఏనుగు ముత్యంరెడ్డి, నాయకులు జక్కుల చంద్రశేఖర్‌,మహేశ్వర రావు,గుర్రం మహేందర్‌గౌడ్‌, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌ సేవలు నామమాత్రమే..

- పదవులే తప్పా.. రైతులకు సేవలు శూన్యం
- మార్కెట్‌ కమిటీ నూతన పాలకవర్గంపై ఆశలు
- నిరుపయోగంగా పెగడపల్లి మార్కెట్‌



పెగడపల్లి వ్యవసాయ మార్కెట్‌ కమిటీ కార్యాలయం

పెగడపల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌ నామమాత్రంగా మారింది. వ్యవసాయ మార్కెట్‌ ఏర్పాటు చేసి పదేళ్లు కావస్తున్నా రైతులకు సరైన సేవలు అందడం లేదు. కాంగ్రెస్‌ ప్రభుత్వంలో ఇటీవల కొత్తగా ఏర్పాటైన పాలకవర్గం మార్కెట్‌ కమిటీ అభివృద్ధిపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. నాలుగు రోజుల క్రితం కొత్త ఏఎంసీ కొలువుదీరింది. వ్యవసాయ మార్కెట్‌ ఏర్పాటు కాకముందు గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్‌కు అనుబంధంగా ఉండేది. ఇక్కడ కేవలం వ్యవసాయ సబ్‌ మార్కెట్‌ కొనసాగించి ఇక్కడి నుంచి తరలిస్తున్న ధాన్యంకు చెక్‌ పోస్టు ద్వారా మార్కెట్‌ ఫీజు వసూలు చేసేది. గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్‌కు అనుబంధంగా ఉన్న పెగడపల్లి సబ్‌ మార్కెట్‌ యార్డును విభజించి 2015లో పెగడపల్లిలో ప్రత్యేక మార్కెట్‌ ఏర్పాటు చేశారు. అనంతరం మొదటి సారిగా 2016లో మార్కెట్‌ కమిటీ పాలకవర్గం నియమించారు. ప్రభుత్వ స్థలంలో గోడౌన్‌, మార్కెట్‌ కమిటీ కార్యాలయం నిర్మించారు. ఇక్కడకు వరకు బాగానే ఉంది. అయితే మార్కెట్‌ ఏర్పాటై పదేళ్లు కావస్తున్నా అడ్తీ వ్యాపారులను నియమించడం గానీ, ధాన్యం కొనుగోళ్లు జరపడం లేదు. ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోక పోవడంతో వ్యవసాయ మార్కెట్‌ నిరుపయోగంగా ఉంటుంది. దీంతో నాయకులకు పదవులు వస్తున్నాయే తప్పా తమకు సేవలు మాత్రం అందడం లేదని రైతులు చెబుతున్నారు.

రూ. 2,50 కోట్లతో అభివృద్ధి పనులు

రూ. 2.50 కోట్లు వెచ్చించి వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. మార్కెట్‌ కమిటీ కార్యాలయం, గోడౌన్‌, మార్కెట్‌ ఆవరణలో స్థలం చదును, ప్రహరీ, స్వాగత ద్వారం నిర్మించారు. కానీ ధాన్యం కొనుగోలు మాత్రం ప్రారంభించడం లేదు. మండలంలో 23 గ్రామాలుండగా రెండు గ్రామాలు మినహా 21 గ్రామాలు పూర్తిగా ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో ఉన్నాయి. రెండు పంటలు సాగవుతున్నాయి. సుమారు 28 వేల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా 26 వేల ఎకరాల వరకు వరి పంటనే సాగు చేస్తున్నారు. ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తున్నారు. కనీసం వ్యవసాయ మార్కెట్‌ ఆధ్వర్యంలో కమీషన్‌పై కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేసుకునే అవకాశం ఉన్నా ఆ దిశగా ప్రయత్నం చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి



వ్యవసాయ మార్కెట్‌ కమిటీ నుంచి ధాన్యం కొనుగోళ్లు చేయాలి. వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేసి అభివృద్ధి పనులకు కోట్లు ఖర్చు చేశారు. మార్కెట్‌ నుంచి ఎలాంటి సేవలు అందించడం లేదు. దీంతో ఇక్కడ పేరుకే మార్కెట్‌ కమిటీ అన్నట్లు ఉంది.

– గంగనాయక్‌, ఏడుమోటలపల్లి తండా

దళారులను ఆశ్రయిస్తున్నారు



వడ్లు కొనుగోళ్లు చేస్తున్నా ఇతర ధాన్యం అమ్ముకోవాలంటే ఇబ్బందిగా ఉంది. పసుపు, మొక్కజొన్న, పప్పు దినుసుల విక్రయాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లలేక రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. మార్కెట్‌ కమిటీ ఆధ్వర్యంలో అన్ని రకాల ధాన్యం క్రయవిక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– బైర పోచయ్య, పెగడపల్లి

పంట కొనుగోలు చేస్తాం



మార్కెట్‌ కమిటీ ద్వారా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. వ్యాపారస్తులు అడ్తీ లైసెన్స్‌లు తీసుకునేందుకు ముందుకు రావాలి. ప్రభుత్వ విప్‌ అడ్లూరి లక్ష్మన్‌కుమార్‌ సహాయంతో వాటిని పూర్తి చేసి మార్కెట్‌ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు సేవలు అందించేందుకు కృషి చేస్తాం.

– బుర్ర రాములుగౌడ్‌ ఏఎంసీ చైర్మన్‌, పెగడపల్లి

ఘనంగా శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం



శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మల్లాపూర్‌: మండలలంలోని గొర్రెపల్లి శ్రీ లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో ఆదివారం శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి కల్యాణం, జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అశేష భక్తజనుల మధ్య అర్చకుల బృందం స్వామి కల్యాణంను వైభవంగా నిర్వహించారు. నాయకులు జువ్వాడి నర్సింగరావు, జలపతిరెడ్డి, మార్కెట్‌ చైర్మన్లు, నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలచందర్‌, మాజీ సర్పంచ్‌లు కొంపెల్లి సరోజ, కదుర్క రాధ, మాజీ ఉపసర్పంచ్‌ కదుర్క గంగనర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరేణుకా ఎల్లమ్మ ప్రతిష్ఠాపనోత్సవాలు



అమ్మవారి ప్రతిష్ఠలో గ్రామస్తులు, అర్చకులు

సారంగాపూర్‌: బీర్‌పూర్‌ మండలం రేకులపల్లిలో శ్రీ రేణుకా ఎల్లమ్మ ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాల్లో అమ్మవారి ప్రతిష్ఠ అనంతరం కార్యక్రమాన్ని నిర్వహించిన బీర్‌పూర్‌ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ అర్చకుడు వొద్దిపర్తి మధుకుమారాచార్యులను గ్రామస్తులు, గౌడ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.

వేంకటేశ్వరస్వామి ప్రతిష్ఠాపనోత్సవాల్లో పూజలు

సారంగాపూర్‌: మండలంలోని రేచపల్లి శ్రీగండి వేంకటేశ్వరస్వామి ప్రతిష్ఠాపనోత్సవాల్లో ఆదివారం మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరుగుతున్న ప్రతిష్ఠాపనోత్సవాల్లో చివరి రోజు ఆలయ శిఖర ప్రతిష్ఠాపన, శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనతో కార్యక్రమాలు ముగిశాయి. కార్యక్రమంలో రేచపల్లి, మ్యాదారంతండా, లచ్చనాయక్‌ తండా, భీంరెడ్డిగూడెం, భక్తులు తరలివచ్చారు.

పుట్ట ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న మహిళలు

రాయికల్‌: మండలంలోని ఇటిక్యాలలో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ ఆలయంలో పుట్ట ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గ్రామంలో శోభాయాత్ర నిర్వహించిన అనంతరం ఆలయంలో ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విగ్రహదాత ఉత్కం సాయ గౌడ్‌ రాధ, అధ్యక్షుడు మరిపెల్లి లక్ష్మణ్‌ గౌడ్‌, ఉపాధ్యక్షుడు కోటగిరి రాజేశం గౌడ్‌, కోశాధికారి రాజా రమేశ్‌ గౌడ్‌, కార్యవర్గ సభ్యులు, గౌడ సంఘం సభ్యులు, మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం



సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న జంటలు

జగిత్యాలటౌన్‌: జిల్లా కేంద్రంలోని వాల్మీకి ఆవాసంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతం ఘనంగా నిర్వహించారు. గ్రామీణ నిరుపేద, కుటుంబాలకు చెందిన బాలురకు క్రమశిక్షణతో కూడిన విద్యా వసతి ఉచితంగా అందిస్తున్న వాల్మీకి ఆవాసంలో ప్రతీ ఏడాది వేసవి సెలవుల ప్రారంభంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించడం ఆనాయితీగా వస్తోంది. ఈ వ్రతంలో సుమారు 200 మంది జంటలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్‌ జిల్లా ప్రచారక్‌ లోకేశ్‌జీ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని, కుటుంబ విలువలను కాపాడుకోవాలని కోరారు. అనంతరం వాల్మీకి ఆవాసం వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్‌ చైర్మన్లు అడువాల జ్యోతి, గిరి నాగభూషణం, ఆవాసం అధ్యక్షుడు పురుషోత్తం, డా భీమనాతిని శంకర్‌, సభ్యులు పాల్గొనారు.

మార్కండేయ పద్మశాలీ సంఘం కార్యవర్గం ఎన్నిక



మల్యాల: మండలంలోని తాటిపల్లి గ్రామ పద్మశాలీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ముల్క మల్లయ్య అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కస్తూరి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా మంచాల లక్ష్మణ్‌, ప్రధాన కార్యదర్శిగా బాలె గంగస్వామి, కోశాధికారిగా పెంట గణేశ్‌, సహాయ కార్యదర్శులుగా గుండేటి రమేశ్‌, విజయ్‌కుమార్‌, ప్రచార కార్యదర్శిగా దాసరి నరేశ్‌, శివప్రసాద్‌, గౌరవ అధ్యక్షుడిగా గంగాధర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కార్యవర్గ సభ్యులతో మండల కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో దాసరి మల్లేశం, బింగి వేణు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో నరేందర్‌ రెడ్డి

జగిత్యాల: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అల్ఫోర్స్‌ విద్యా సంస్థల అధినేత నరేందర్‌ రెడ్డి అన్నారు. ఆదివారం అల్ఫోర్స్‌ కళాశాలకు చెందిన విద్యార్థులు అంకిత సాయి, మధు, గోపిక హర్షిత, సాకేత్‌, వర్షిత్‌, గ్లాడిస్‌, లహరిక, శివాణి, భార్గవి జేఈఈ మెయిన్స్‌లో అత్యధిక పర్సంటేజ్‌ సాధించగా, వీరిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్ఫోర్స్‌ విద్యా సంస్థలు విద్యార్థులకు అత్యుత్తమ విద్య అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమన్నారు.

ఘనంగా ఈస్టర్‌ వేడుకలు



భూషణరావుపేట చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కథలాపూర్‌: మండలంలోని భూషణరావుపేట, తాండ్ర్యాల, కథలాపూర్‌ గ్రామాల్లోని చర్చిల్లో ఆదివారం ఈస్టర్‌ పర్వదినం వేడుకలు ఘనంగా నిర్వహించారు. 41 రోజులు ఉపవాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలు చేయడంతో ఏసుక్రీస్తు పునరుర్థానుడైన రోజు ఈస్టర్‌ అంటూ క్రైస్తవులు సంతోషంగా ఉత్సవాలు జరిపారు. ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. సామూహికంగా భోజనాలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు గసికంటి సామ్యేల్‌, ఫ్రాన్సిస్‌, బ్రదర్‌ కిషన్‌, నరేశ్‌, రాజేశ్‌ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్‌ స్తంభం



కథలాపూర్‌: మండలంలోని సిరికొండలో ఏడో వార్డులో పాత విద్యుత్‌ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని కొత్త విద్యుత్‌ స్తంభాలు ఏర్పాటు చేశారు. కానీ పాత విద్యుత్‌ స్తంభంపై సింగిల్‌ ఫేజ్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను యథావిధిగా ఉంచడంతో ప్రమాదకరంగా మారిందని స్థానికులు పేర్కొన్నారు. అధికారులు దృష్టిసారించి కొత్త స్తంభాలపై ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: రఘుపతి
ట్రాన్స్‌కో ఏడీఈ, కోరుట్ల రూరల్‌ : 9989679675

వాట్సాప్‌ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్‌ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్‌ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు పంపిణీ



మల్లాపూర్‌లో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న జువ్వాడి నర్సింగరావు

మల్లాపూర్‌/ఇబ్రహీంపట్నం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, సామాజిక న్యాయం కాంగ్రెస్‌ పార్టీతోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్‌ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మల్లాపూర్‌ కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో, ఇబ్రహీంపట్నం కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు పంపిణీ చేశారు. కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కిసాన్‌ కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మార్కెట్‌ కమిటీ చైర్మన్లు అంతడుపుల పుష్పలత నర్సయ్య, బోరిగం రాజు, వైస్‌ చైర్మన్లు ఇట్టెడి నారాయణరెడ్డి,ఎలాల వెంకట్‌రెడ్డి, డైరెక్టర్‌ నూతిపెల్లి రాజం, కాంగ్రెస్‌ మండల అధ్యక్షులు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, గూడ శ్రీకాంత్‌రెడ్డి, సేవాదళ్‌ మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గంగాధర్‌, దేవేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

కోరుట్ల: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దేవాదయ శాఖ జగిత్యాల డివిజన్‌ ఇనిస్పెక్టర్‌ ఎం. రాజమొగిలి నూతన సభ్యులచే ప్రమాణం చేయించారు. చైర్మన్‌గా యతిరాజం నర్సయ్య, ధర్మకర్తలుగా నేతి శ్రీనివాస్‌, కట్కం దివాకర్‌, కోట గంగాదర్‌, గొడికె రాములు, చిలువేరి విజయ్‌ కుమార్‌, చిల్యాల పద్మ, ఎక్స్‌ అఫిషియో సభ్యుడిగా బీర్నంది నరసింహాచారి ప్రమాణం చేశారు. కార్యక్రమానికి హాజరైన జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ ఆలయాన్ని గత పదేళ్ల పాటు పాలకులు పటించుకోలేదన్నారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నూతన కమిటీ ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ కోరుట్ల పట్టణ, మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్‌, కొంతం రాజం, బీసీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేష్‌, మహిళా అధ్యక్షురాలు మచ్చ కవిత, నాయకులు పాల్గొన్నారు.

వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎమ్మెల్సీ కవిత

జగిత్యాల: అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో చేతికొచ్చిన వరి, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ధాన్యం పూర్తిగా తడిచిపోయిందని పేర్కొన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న మామిడికాయలు పూర్తిగా రాలిపోయాయని పేర్కొన్నారు. ఒక్క కోరుట్ల నియోజకవర్గంలోనే 12 వేల ఎకరాల్లో వరి, మామిడి, మొక్కజొన్న, నువ్వులు, సజ్జ పంటకు దెబ్బతిన్నాయని, ఇబ్రహీంపట్నం మండలంలో 6 వేల ఎకరాల్లో దెబ్బతిన్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు.

జై బాపు,జై భీం,జై సంవిధాన్‌ కార్యక్రమానికి తరలిరావాలి

- మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

సారంగాపూర్‌: బీర్‌పూర్‌ మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో జరిగే జై బాపు..జై భీం...జై సంవిధాన్‌ కార్యక్రమానికి బీర్‌పూర్‌ మండల ప్రజలతో పాటు, కాంగ్రెస్‌ కార్యకర్తలు తరలిరావాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కోరారు. ఆదివారం రేచపల్లిలో మాట్లాడారు. బీర్‌పూర్‌లో ఉదయం 9 గంటలకు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నుంచి అంబేడ్కర్‌ విగ్రహం వరకు ర్యాలీ అనంతరం సభ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సారంగాపూర్‌ మండల కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు కోంద్ర రాంచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్‌లు మోత్కూరి ప్రసాద్‌గౌడ్‌, భూక్య లావణ్యారాథోడ్‌, మండల యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ఆసాది హరీష్‌, తదితరులు ఉన్నారు.

నేడు అంజన్న దీక్షాపరుల ముడుపులు ఓపెన్‌

మల్యాల: ముత్యంపేటలోని శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహించిన హనుమాన్‌ జయంతిని పురస్కరించుకుని ఆలయ పరిసరాల్లో నిల్వ చేసిన దీక్షాపరుల ముడుపులు సోమవారం విప్పనున్నట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌ రావు తెలిపారు.